క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు



గురండిలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

భామిని: మండలంలోని గురండి సెంటర్‌లో బత్తిలి పోలీసులు గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. బత్తిలి ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు ఆధ్వర్యంలో ఏబీ రోడ్డుపై వాహనదారుల అనుమతి పత్రాలు పరిశీలించారు.పక్కా పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం వేశారు. మైనర్లు బైక్‌లు నడపడం సరికాదని హెచ్చరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది, అధికారులు

పాలకొండ రూరల్: గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సిమ్మాలమ్మ అన్నారు. స్థానిక కార్యాలయంలో పోషకాహార వారోత్సవాలు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న సేవలు వివరించారు. గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల అందిస్తున్న పోషకాహార ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు టి.మేరీ, పద్మావతి, దశారత్నం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన మోడరన్ మార్కెట్ యార్డు సందర్శన

పార్వతీపురం టౌన్: మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో నూతన మోడరన్ మార్కెట్ యార్డును ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతనమైన మార్కెట్ యార్డు ఇది అని, ఎటువంటి వర్షం వచ్చినా, ఎండకురిసినా మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలను సాగించే స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకావు. సవ్యంగా, సాఫీగా కూరగాయల మార్కెట్‌లో క్రయవిక్రయాలు సాగేలా మంచి మార్కెట్ యార్డ్‌ను నిర్మించడమే కాకుండా దానిని మరింత మెరుగుపరిచి అధునాతనంగా తీర్చిదిద్దేందుకు కృషిచేశామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సవరాపు రాజారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ వెంపలి గురురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు



వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని డీఐఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం కమ్యూనిటీ మేనేజ్ ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రంలో ఆయన కూరగాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న జీవన విధానంలో మనం తీసుకున్న ఆహారం ఆరోగ్యంపట్ల ప్రభావితం చూపిస్తుందన్నారు. రసాయన ఎరువుల వాడకం అధికంగా ఉన్న ఆహార ఉత్పత్తులను ఎక్కువగా తీసుకోవడం వల్ల మానవాళి ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. దీర్ఘకాలికంగా ఇటువంటి ఆహారం తీసుకోవడం వల్ల రసాయనాలు శరీరంలోని ముఖ్యమైన అవయవాలను దెబ్బతీస్తున్నాయని చెప్పారు. అదే ప్రకృతి వ్యవసాయ విధానంలో సేంద్రియ ఎరువుల వినియోగంతో పండే ఉత్పత్తుల్లో ఎటువంటి హానికర రసాయనాలు ఉండవని ఆ ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని హితవు పలికారు. కార్యక్రమంలో వై.యోగీశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పెదంకలాంలో ఉద్ధృతంగా నీటి ప్రవాహం

సీతానగరం: మండలకేంద్రానికి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురవడంవల్ల గురువారం ఉదయం నుంచే సువర్ణముఖి నదిపై ఉన్న పెదంకలాం డ్యాం(ప్రాజెక్ట్) మీదుగా వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నదిపై ఉన్న డ్యాం మీదుగా నీరు నిల్వ ఉన్నందున నిరంతరం ప్రజలు తిరుగాడే బూర్జ రేవు నీరుతో ముంపునకు గురవడం వల్ల ప్రమాదం పొంచి ఉంది. అలాగే వరిచేను పొలాలు నీటమునిగాయి. నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలించి ప్రయాణించాలని తహసీల్దార్ రమణ సూచించారు.

విస్తారంగా వర్షాలు



పాలకొండ రూరల్: పాలకొండ - పార్వతీపురం రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పాలకొండ రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్ష ప్రభావం మండల వ్యాప్తంగా కనిపిస్తుంది. వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువుల్లో జలకళ సంతరించుకుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంట వేసిన రైతులకు అకాల వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్ష ప్రభావంతో గురువారం నాటికి రాజుపేట, అర్దలి, వీరఘట్టం రహదారుల్లో పంట భూముల్లో నీరు చేరింది. పాలకొండ - పార్వతీపురం రహదారిపై వర్షపునీరు ప్రవహించటంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో వ్యవసాయాధికారిణి ఎన్ని వాహిని మాట్లాడుతూ వాతావరణ శాఖ అధికారుల సూచనల మేరకు మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పంట భూముల్లో నీరు నిల్వ లేకుండా రైతులు చూడాలన్నారు. పొలం చుట్టూ కాలువలు తవ్వి పొలంలో నిలిచిన నీరు బయటకు వెళ్లే మార్గాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎరువులు, పురుగు మందుల పిచికారీ చేయటం వంటి పనులు వాయిదా వేసుకోవాలన్నారు.

ఎడతెరిపి లేని వర్షం

జియ్యమ్మవలస: మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం సాయంత్రం నుండి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. రెండు రోజుల పాటు వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వాగులు, చెరువులు నిండడంతో ఈ సంవత్సరం వరి పంటకు ఢోకా ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం 8 గంటల నుండి గురువారం ఉదయం 8 గంటల మధ్య 58.7 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని సంబంధిత అధికారులు తెలిపారు.



పాలకొండ రూరల్: రాజుపేట సమీపంలో వరి పంట భూముల్లో చేరిన వర్షపునీరు

సందడిగా ఉట్టి కొట్టే పోటీలు



భామిని: లివిరిలో చిన్నికృష్ణుని కోసం సిద్ధం చేసిన ఊయల



పసుకుడిలో ఉట్టికొట్టే పోటీలలో యువకులు

భామిని: మండలంలోని పసుకుడిలో వెలసిన శ్రీకృష్ణుని మందిరం వద్ద ఉట్టి కొట్టే పోటీలు గురువారం సందడిగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పోటీలు నిర్వహించారు. సర్పంచ్ బెవరా భార్గవనాయుడు ఆధ్వర్యంలో యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం హరేరామ సంకీర్తన బృంద సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లివిరిలో...

భామిని: మండలంలోని లివిరిలో వెలసిన శ్రీగోపీనాథ రాధాకృష్ణ మందిరంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. గోపాలకులు సామూహికంగా పూజలు నిర్వహించారు. చిన్ని కృష్ణుడును ఊయలలో వేసి సంబరాన్ని సందడిగా అర్ధరాత్రి నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ముందుగా భక్తులు పాలు, పాల పదార్థాలను నైవేద్యంగా పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్కళ సాంప్రదాయం ప్రకారం అష్టమి వేడుకలను మిగులులో నిర్వహించడం ఆనవాయితీ. మండలంలోని పాత ఘనసరలో వెలసిన అభయ కోదండ రామాలయంలోనూ కృష్ణాష్టమి పూజలు నిర్వహించారు. బాలేరు.పెద్దదిమిలిలలోనూ వేడుకలు నిర్వహించారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో కొలువైన లక్ష్మీనృసింహ ఆలయంలో ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామిని వివిధ రకాల పూలు, పత్రాలతో ప్రత్యేకంగా అలకంరించారు. అలంకరణ అనంతరం మేరకు ఉదయం 6 గంటలకే ఆలయానికి పూజా సామగ్రితో చేరుకున్న భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే కృష్ణజన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, కృష్ణభగవానుడి లీలలపై కథానిక వినిపించారు.

రాంబాబు మాస్టారుకు సత్కారం



రాంబాబు మాస్టారును సత్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

వీరఘట్టం: ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మండలంలోని చిట్టపులివలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబు మాస్టారును వీరఘట్టం ఎంఈఓలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావులు గురువారం సత్కరించారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వీరితో పాటు పలువురు ఉపాధ్యాయులు రాంబాబు మాస్టారును ఘనంగా సత్కరించారు.

ఘనంగా జై గురుదత్త హోమాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం శ్రీ జయగురుదత్త హోమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించిన పిమ్మట ప్రముఖ యజ్ఞయాగకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజి సహకారంతో ఆలయ అర్చకులు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురుదత్త హోమాలను దంపతులతో నిర్వహించారు. అనంతరం భక్తులకు దీక్షా వస్త్రాలను, ప్రసాదాలను కమిటీ సభ్యులు అందజేశారు. అనంతరం ఆలయంలో దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



వరిలో యాజమాన్య పద్ధతులపై వివరిస్తున్న వెలుగు ప్రతినిధులు

సీతంపేట: మండలంలోని గూడగుడ్డి గ్రామంలో వెలుగు అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ప్రస్తుత ఆరోగ్యం గూర్చి, మానవ జాతి ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు. జీడి యాజమాన్య పద్ధతులు, కూరగాయలు పండించే విధానం, పంటపై యూరియా, డీఏపీ బదులు జీవామృతాల వాడకంపై అవగాహన కల్పించారు. కషాయాల తయారీ గూర్చి తెలిపారు. కాలిబాటలు, లైన్ షోయింగ్ గూర్చి చెబుతూ రూ.2,400ల కోన్‌వీడర్‌గాను రైతుల వాటా రూ.400, వెలుగు వాటా రూ.2,00లుగా తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేడు 3, 5 వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పాలకొండ: నగర పంచాయతీలోని 3, 5 వార్డుల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. గురువారం జరగాల్సిన కార్యక్రమం వర్షం కారణంగా రద్దు చేశామని తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమానికి అన్ని శాఖల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్‌కు ఎంపికలు

సీతంపేట: ఈ నెల 12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌కు ఎంపికలు జరగనున్నాయని ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అన్ని పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి పంపించాలన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి గేమ్స్ జరగాల్సి ఉన్నప్పటికీ వర్షాలు కురుస్తున్న కారణంగా తాత్కాలికంగా వాయిదా పడ్డాయని తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ రెసిడెన్షియల్ ఐటీఐలో మిగులు సీట్లు భర్తీ చేపట్టేందుకు ఈ నెల 22న నాల్గో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రస్తుతం తమ శిక్షణ కేంద్రంలో డ్రస్ మేకింగ్ ట్రేడ్‌లో 39 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 19వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తులు సమర్పించడంతో పాటు ఈ నెల 20వ తేదీన తమ ఐటీఐకు వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే కౌన్సెలింగ్‌కు విద్యార్హత ధ్రువపత్రాలన్నీ ఒరిజినల్‌ను వెంట తీసుకురావాలని కోరారు.

పక్కాగా ఓటర్ల జాబితా పరిశీలన



భామిని: బాలేరులో ఓటరు దరఖాస్తులు పరిశీలిస్తున్న పీడీ కిరణ్‌కుమార్

భామిని: ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపుపై వచ్చిన అభ్యంతరాలను పక్కాగా పరిశీలించి కారణాలు రాయాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని బాలేరు, సొలికిరి పోలింగ్ బూత్‌ల పరిధిలో ఓటర్ల తొలగింపు దరఖాస్తుల విచారణను గురువారం పరిశీలించారు. డెత్‌లు, మైగ్రేషన్, డబుల్ ఎంట్రీలు నిశితంగా విచారించాలని బీఎల్‌ఓలకు సూచించారు. మండలంలోని తొలగింపు దరఖాస్తులను పరిశీలించారు.

సంఘాలకు ఆర్థిక పరిపుష్టి

మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక పరిపుష్టి కల్పించేలా శ్రమించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. భామిని వెలుగు కార్యాలయంలో ఏపీఎం డి.భవానీ అధ్యక్షతన జరిగిన వీఓఏల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మనమిచ్చే రుణాలపైనే దృష్టి పెట్టకుండా స్వయం శక్తి పెంచేలా ప్రోత్సాహించాలన్నారు. మండలంలోని 1098 ఎస్‌హెచ్‌జీల పరిధిలో 1300 మంది సభ్యులు సమష్టిగా ఆర్థిక సాధికారత కార్యాచరణ చేపట్టాలన్నారు. వెలుగు సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

సక్రమంగా జాబితాలను పరిశీలించండి

పాలకొండ: ఓటర్లు జాబితాను సక్రమంగా పరిశీలన చేసి తుది జాబితాలు అందించాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని బీఎల్‌ఓలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఆ పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓట్లు, ఇంతవరకు సర్వే పూర్తి చేసినవి, ఫారం - 9, ఫారం - 6ల కింద నమోదు చేసిన ఓట్లు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అనంతరం బీఎల్‌ఓలు తుది జాబితా కోసం తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. మరణించిన వారు, పూర్తిగా గ్రామం వదిలి వెళ్లిన వారు, రెండు ఓట్లు ఉన్న వారిని గుర్తించి వాటిని తొలిగించాలని సూచించారు. గ్రామాల్లో రాజకీయ పక్షాల ప్రతినిధుల సమక్షంలో తుది జాబితాను ప్రకటించాలన్నారు. ఆయనతో పాటు టీడీ బుచ్చయ్య, ఆర్ఐ పుష్ప ఉన్నారు.



పాలకొండ: ఓటర్ల జాబితాపై సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్

సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



తల్లులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

భామిని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులతో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందుతున్నదని బాలేరు ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ అన్నారు. సొలికిరి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన సుపోషణా దివాస్‌లో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ కిట్లు అందించి మాట్లాడారు. క్రమ పద్ధతిలో పౌష్టికాహారం స్వీకరించాలని సూచించారు. కార్యకర్తలు అందించే ఆరోగ్య పరిరక్షణ సూత్రాలను పాటించాలన్నారు. బాలేరు, సొలికిరి అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు.

అర్హులందరికీ పింఛన్లు అందజేస్తాం..

● ఎమ్మెల్యే కళావతి



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: అర్హులైన ప్రతీ ఒక్కరికి పింఛన్లు అందజేస్తామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవ క్యాంపు కార్యాలయంలో ఇటీవల కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు గురువారం అందజేశారు. అర్హతే కొలమానంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన చేస్తున్నారన్నారు. ఒకప్పుడు టీడీపీ హయాంలో పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా వృద్ధులు, మహిళలు తిరిగేవారని, నేడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హత ఉన్నవారందకి పింఛన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

విక్రయానికి సిద్ధమైన గణనాథుల విగ్రహాలు



అమ్మకాలకు కొలువుదీరిన గణనాథుని విగ్రహాలు

పాలకొండ రూరల్: కొద్ది రోజుల్లో తొలి పూజలు అందుకోనున్న గణనాథుని ఉత్సవాలకు సంబంధించి విగ్రహాలు సిద్ధమయ్యాయి. పాలకొండ - శ్రీకాకుళం, వీరఘట్టం, విశాఖ ప్రధాన రహదారిలో విక్రయదారులు భారీ నుండి చిన్న విగ్రహాలను అమ్మకాలకు సిద్ధం చేశారు. విగ్రహాలను ప్రత్యేక షెడ్‌ల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచారు. విగ్రహాలను ముందస్తుగా కొనుగోలు చేసుకునేందుకు ఉత్సవ నిర్వాహకులు ఉత్సుకత చూపుతున్నారు. ఇదిలా ఉంటే పట్టణంలో పెద్దకాపు వీధి, వినాయక ఆలయ కూడలి, యాలాం కూడలి, పెద్దగొల్లవీధి వద్ద యువత మండపాలను కొలువుదీర్చి గణేష్ నవరాత్రులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల మంజూరు



పింఛన్లను అందజేస్తున్న ఉప సర్పంచ్

గరుగుబిల్లి: అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేస్తుందని పెద్దూరు గ్రామ ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు అన్నారు. గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్లను పలువురుకు ఆయన గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలకు అతీతంగా ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా అర్హులకు పింఛన్లను మంజూరు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి డి.సుభద్ర, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ ఓ.లక్ష్మి వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.